# వట్టిమనిషి

## సుంకోజి దేవేంద్రాచారి

1

తను ఆడమనిషి


***

తనప్రమేయం లేకుండానే మనిషి ఎలా అయితే కులానికి, మతానికి ప్రాతినిథ్యం వహిస్తున్నాడో అలానే లింగ భేదం కూడా కొన్ని పనులకు పరిమితం చేస్తోంది. అలా సమాజం సన్నద్ధం చేస్తోంది.

***

''మై నేమ్ ఈజ్ ఒజిమాండియస్. ఐయామ్‌ది కింగ్ ఆఫ్ కింగ్స్..''

''మేయ్.. సుశీలా.. ఎన్ని సార్లు పిల్చాలమే నిన్ను.. ఇంటి ముందర కసువూడ్చుపో'' అరిచింది నారాయణమ్మ.



అప్పటికి ఆమె అరవడం నాలుగోసారి. అయినా సుశీల ఆ పని చేయలేదు. తను చదువు తున్న పుస్తకంలోంచి తలెత్తి ఒకసారి హాల్లోకి చూసింది. అన్న నిద్రపోతున్నాడు.

'అమ్మ చిన్నప్పట్నించీ ఇంతే.. అన్నకయితే ఏ పనీ చెప్పదు. నాకే అన్ని పనులూ చెప్తాది' అను కుంది మనసులో. రేపు బడిలో అప్పజెప్పాల్సిన ఇంగ్లీషు పోయం నేర్చుకోవడం కోసం తిరిగి గట్టిగా చదవడం మొదలు పెట్టింది.

''మై నేమ్ ఈజ్ ఒజిమాండియస్. ఐయామ్‌ది కింగ్ ఆఫ్ కింగ్స్..'' అని చదువుతూండగానే నారా యణమ్మ కోపంగా వచ్చి కూతురి చేతిలోని పుస్తకం లాగి దూరంగా విసిరేసింది.

''మీ నాయన నిద్ర లేసేలకు ఇంటిముందు కసువూడ్చి కళ్లాపి చల్లమని రోజూ చెప్పాలా?'' అంది నారాయణమ్మ.

''ఈ రోజు స్కూల్లో ఈ పోయం అప్ప జెప్పాలమ్మా..'' అంది మెల్లగా సుశీల.

''ఆడబిడ్డకు ముందు ఇంట్లో పని అయినాంకనే, చదువు..! చదువుకుంటాను ఇంట్లో పనిచేయనంటే ఎట్లా?'' అంది పొయ్యి దగ్గర వంట చేస్తూ నారాయ ణమ్మ. ''మనిషికోమాట గొడ్డుకో దెబ్బ అంటారు. రెడ్డొచ్చె మొదులెత్తు అన్నెట్టు నీకు దినమ్మూ చెప్పలేను. ఇంట్లో మొగోళ్లు బయటికి పోయేలకు ఇంటి ముందర కసువూడిస్తే మనకే మంచిది. పోపో'' అరిచింది.

ఒకసారి పెద్దగా నిట్టూర్చి, చీపురు తీసుకుని, తను అంతవ రకూ నేర్చుకున్న 'ఒజిమాండి యస్' కవితను వల్లెవేసుకుంటూ చెత్త ఊడ్చడం మొదలు పెట్టింది సుశీల.


సుశీలకు పద్నాలుగేళ్లు దాటాయి. బక్కపలచగా, తెల్లగా ఉంటుంది. లంగావోణీలో ఉంది. పొడవాటి జుట్టు. రాత్రి నిద్రలో చెదిరిన ముంగురులు చెత్త ఊడు స్తుంటే ఆ అమ్మాయి కళ్లకు అడ్డం పడుతున్నాయి.

తూర్పు ఆకాశం అరుణ వర్ణం పులుముకుం టోంది. సంజె వెలుగు నేలంతా పరచుకుం టోంది. అది చిత్తూరు జిల్లాలోని ఐదువందల గడప ఉన్న పల్లె. దాదాపు అందరి ఇళ్లలో పాత్రల చప్పుడు వినిపిస్తోంది. అప్పటికే కొందరు ఇళ్ల ముందు కసువూడ్చి, కళ్ళాపి చల్లి, ముగ్గువేసే శారు. డిసెంబర్ నెల కావడంతో బాగా చలిగా ఉంది.

"ఎన్నిసార్లు చెప్పాలమ్మా ఈ బిడ్డకు.. రేపు కట్టుకున్నోడు ఎట్లేగతాడో ఏమో.. ఏ పని చేస్తాంటే అదే మల్ల. గబగబా చేద్దామనే లోకమే ఉండదు.. మేయ్ సుశీలా.. తొందరగా కానిచ్చి రా.. బోరింగ్ కాడికి పోయి నీళ్ల తేవాల" గట్టిగా అరిచింది నారాయణమ్మ.

ఇంటి ముందు పనయిపోగానే వంటగ దిలోకి పోయి బిందె తీసుకుంది సుశీల. బోరింగ్ దగ్గరకు పోతూ పోతూ హాలులో పడుకోనున్న అన్నను చూసింది. అతను ముసుగేసుకుని పడు కుని గుర్రు పెడుతున్నాడు. అతనికి చదువుకో వడం తప్ప వేరే ఏ పనీ చెప్పదు నారాయణమ్మ. ఏమంటే మగబిడ్డ కదా అంటుంది. వంటపని చేపించకపోతే పోనీలే, కనీసం బోరింగు దగ్గర నుంచి నీళ్లయినా తెమ్మని చెప్పచ్చు కదా అనుకుం టుంది సుశీల. ఒకసారి ఆ మాటే అమ్మతో అంది. దానికామె "మగబిడ్డ ఆడంగి పనులు ఎందుకు చేస్తాడే" అంది ఆశ్చర్యంగా. ఎంత తప్పుడు మాట చెప్పినావు అనే ధోరణిలో కూతురు వైపు చూసింది. ఇక అప్పటినుంచి అలా ప్రశ్నించడం మానుకుంది సుశీల.

వయసు పెరిగే కొద్దీ ఇంట్లో వంటచేయడం, బట్టలుతకడం, అంట్లు తోమడం, కసువూడ్చడం నాన్న ఏ రోజూ చేయకపోవడం తను గమనిం చింది. అమ్మకు తీవ్రంగా జ్వరం ఉన్నా సరే.. ఆ పనులన్నీ అమ్మే చేసుకోవాల్సిందే. అన్న సుధాకర్ కూడా తనకేమీ పట్టనట్టు ఉండేవాడు. అమ్మ అవస్థ చూడలేక ఆమె పనుల్లో స్వచ్ఛందంగానే సాయం చేయడం మొదలు పెట్టింది సుశీల. అయితే వయసు పెరిగే కొద్దీ ఆ అమ్మాయి ఆలో చనా ధోరణిలో మార్పు రావడం మొదలు పెట్టింది. అన్న, నాన్న ఇంట్లో పనులు ఎందుకు చేయరు? అనే ప్రశ్న చాలా సార్లు వచ్చింది. దానికి చాలామంది పెద్దల దగ్గర నుంచి ముఖ్యంగా ఆడవాళ్ల దగ్గర నుంచి వచ్చిన సమాధానం 'వాళ్లు మొగోళ్లు కదామ్మా.. ఈ పనులెం దుకు చేస్తారు' అని.




'మొగోళ్లకోసరం కొన్ని పనులు, ఆడోళ్ల కోసరం కొన్ని పనులు ముందుగానే నిర్ణయించేసి ఉంటాయా? ఇద్దరూ సమానం కాదా? కుటుంబమన్నాక అన్ని పనుల్లో ఇద్దరూ పాలుపంచుకోరా' అనే ప్రశ్నలు సుశీలలో వచ్చాయి. అయితే వాటికెవరూ సమాధానం చెప్పలేదు. సరి కదా 'ఆడబిడ్డ అతిగా మాట్లాడకూడదు' అన్నారు.

'అయితే మగబిడ్డ మాట్లాడచ్చా' అన్న ప్రశ్న నోటిదాకా వచ్చినా మౌనంగా వుండిపోయింది సుశీల. చాలా చిన్న చిన్న విషయాలు.., అంటే కూరలో ఉప్పు ఎక్కువయిం దనో, తెల్ల చొక్కాయికి నీలిమందు సరిగా అంటలేదనో అమ్మపైన నాన్న పెద్దపెద్దగా కేకలు వేయడం వింది. అయితే అమ్మ ఎప్పుడూ నాన్న మీదేం ఖర్మ, కనీసం నాన్న పరో క్షంలో కూడా గట్టిగా మాట్లాడ్డం తను చూడలేదు.

ఇవంతా ఆలోచించుకుంటూ బోరింగ్ దగ్గరకు పోయింది సుశీల. అప్పటికే అక్కడ సుమారు అరేడుమంది ఆడ వాళ్లు, బిందెలు వరుసలో పెట్టి నిలబడుకుని ఉన్నారు.

## 2

### తను ఇంటిమనిషి

***

ఇంట్లో ఉండేవాళ్లందరూ ఇంటి మనుషులు కారు. కేవలం స్త్రీ.. అమ్మ, భార్య, కూతురు.. వరస ఏదయినా కావచ్చు..ఇంటిని కనిపెట్టుకుని ఉండాల్సిన బాధ్యత స్త్రీదే(నా)?!

***

"ఏమైంది సుశీలా.. కుడికంటికింద నల్లగా కమిలిందాది?"

రాత్రి నాగాచారి తాగేసి వచ్చాడు.'వయసు కొచ్చిన ఇద్దరు కూతుళ్లుండారు. ఇంకా ఎందు కిట్లా తాగడం, ఏమన్నా మిగిలిచ్చి వోళ్లకు పెండ్లిండ్లు చేయాలా వద్దా' అని భర్తను నిలదీ సింది సుశీల. 'నన్నే ఎదిరించి మాట్లాడతావా? నోర్మూసుకుని పడుండు' అంటూ భార్యను కొట్టాడు. వారంలో ఒకటి రెండు రోజులయినా నాగాచారి భార్యను కొడుతున్నాడు. పక్కన ఇంట్లో వాళ్లకు ఆ దెబ్బలు బాగా వినిపిస్తాయి. ఆ సంగతి తెలిసే అడిగింది పక్కింటి గోవిందమ్మ.

"రాత్రి నిద్దర్లో లేచి, బాత్రూంకు పోతాండి పడిపోయినాక్కా" బదులిచ్చింది సుశీల.

"జాగ్రత్తమ్మా. బెడ్ లైట్ ఒకటి తెచ్చేసు కోండి. ఇంతకు ముందు రోట్లో చానాసేపు రుబ్బు తాన్నేవే.. ఏంది?"

"అల్సందలక్కా... వడలు చేసేదానికి.."

"పండగలేదు ఏం లేదే.. ఇప్పుడెందుకు వడలు?"

"మా ఆయనకు ఎప్పుడు తినాలనిపిస్తే అప్పుడు చేయాల్సిందేక్కా.. ఐదుగంటలకు రుబ్బి పెట్టుకోమన్నేడు. వస్తావస్తా నాటుకోడి మాంసం తెస్తానన్నేడు. ఆయనొస్తానే ఒగపొయ్యి మీద కూర, ఇంగో పొయ్యిమీద వడలు కాల్చా లంట. మా ఆయనకు కాలే కాలే వడలంటేనే ఇష్టం" చెప్పింది సుశీల.

"నీకేంమా.. ఇంట్లో ఇద్దురు కూతుండ్లుం డారు.. అత్తుండాది. వోళ్లు సాయం చేస్తారు.. మొగుడు కోరుకునింది చేసి పెడతావు. నాకూ.., ఇంట్లో ముగ్గురు మొగోళ్లు.. ఒగదాన్నే ఇటి పనులు చేసుకోలేక సస్తాండాననుకో" అంది గోవిందమ్మ.

"పెండ్లయి అత్తగారింటికొచ్చి ఇరవై ఏండ్ల యితాండాది. ఇబ్బుటిదాకా మా అత్త నాకు వంటపనిలో ఏ పొద్దుగాని సాయం చేసింది లేదు. ఇంగా వాళ్ల కొడుకుతో కలిసి నాలుగు మాటలం టాదంతే" కోపంగా అంది సుశీల.

"ఏ ఇంట్లో అయినా అత్తలంతేలేమ్మా.. రెండు రోజులనుంచి కనిపించలేదే ముసిలా

యమ. యాడికి పోయింది''

''చిన్న కొడుకింటికి పోయిండాది. రేపో మన్నాడో వస్తాది''

''మీ ఇంట్లో రోజు మార్చి రోజు చికెనో, మటనో చేస్తాంటారు. ఆదివారం ఆదివారం బిర్యానీ చేస్తాంటారు. ఆ మాదిర్తో నీసు ఎట్లమ్మా తినేది?''

''నీసు లేని రోజు కోడిగుడ్ల పులుసున్నా చేయాల, లేదంటే ఆమ్లెట్టన్నా ఏసియ్యాల. మా ఆయనకు నీసులేందే ముద్ద దిగదక్కా... అదీ ఆయనకు చానా రుచిగా ఉండాల. కొంచెం ఉప్పెక్కువయినా తిట్లే, కొంచెం కారం తగ్గినా తిట్లే..''

''అవునంట, మీ అత్త చెప్పింది. మీ ఆయన చిన్నప్పట్నించి రుచిగానే తినేవాడంట కదా. అయినా, మీ ఆయన సంపాదనంతా తిండికే ఖర్చయిపోయేటిగా ఉండాదే '' అంది గోవిందమ్మ.

''తిండి ఒగటే అయితే బాదలేదక్కా... తాగేది కూడా ఉండాది కదా.. తాగినప్పుడు ఆయనకు కిందామీదా తెలీదు.రెండుమూడుతూర్లు తాగేసి దుడ్డు పోగొట్టుకున్నేడు. ఆ దుడ్డు ఆసాములిచ్చిందంట. వోళ్లు గమ్మునుంటారా? దానికోసరం అప్పు.. ఇంట్లో ఇద్దురు ఆడబిడ్డలుండారే.. వోళ్లకు పెండ్లిండ్లు చేయాల గదా.. తాగుడుమానుకుందామే, దుబారా తగ్గిద్దామే అనేదే లేదు..'' బాధగా చెప్పింది సుశీల.

''పోనీ నువ్వేదన్నా పని చేయచ్చు కదా..?'' ఓ ఉచిత సలహా ఇచ్చింది గోవిందమ్మ.

''మా ఆయనకు ఇష్టం లేదక్కా... ఆడోల్లు బయట పనులు చేయకూడదంట. ఇంట్లో అన్నీ సక్రమంగా చూసుకుంటే చాలంట. మొగోడు బయట ఎక్కడ తిరిగినా ఆడది ఇంటిని కనిపెట్టుకోనుండాలంట. నేను బయట ఆడోళ్లతో మాట్లాడినా కూడా తప్పే.. కనీసం మా పుట్టింటికి కూడా పండగలకు పంపడక్కా..., నువ్వూ చూస్తానే ఉండావు కదా.. సమచ్చరానికో రెండేండ్లకో ఒకసారి పోతాంటాం. ఆడికి పోయినప్పటి నుంచీ, పోదాం పదా అంటా ఉంటాడీయన. అట్లయ్యి యాడికీ పొయ్యేదే లేదు''

''త్యాగరాయ మండపంలో చీరల ఎగ్జిబిషన్ పెట్టినారంట.. డ్రెస్‌లు, ఫ్యాన్సీ వస్తువులు అన్నీ ఉండాయంట. బాగా అగ్గవకు దొరుకుతాండాయంట. రేప్పోతాండా. వస్తావా?'' అడిగింది గోవిందమ్మ.

''నీకు తెలుసు కదాక్కా... మా ఇంటి గడప దాటి నేను బయటకు పోయేది మా ఆయనకు ఇష్టం ఉండదు.'అన్నీ తెచ్చి ఏస్తా.., లక్షణంగా చేసుకోని తిను, ఇంట్లో ఉండు. బయటకు పోవద్దు. నీకేం కావాలో చెప్పు, తెచ్చి పడేస్తా' అంటాడు. ఆయనకు తెలీకుండా అంగిట్లోనించి చిన్న సూది తెచ్చినా తప్పే.. పెద్ద గొడవ చేసేస్తాడు'' అంది సుశీల నవ్వుతూ.

''మా ఇంట్లో కూడా బయటకి పోవద్దంటారు కానీ, వోళ్లు లేనప్పుడు నేనే పోతాంటా''

''నేను గూడా అట్లొగసారి పోయినా..ఆ సంగతి తెలిసి మా ఆయన నన్ను గొడ్డును కొట్టినట్టు కొట్టినాడు. అప్పుట్నించి బయటకు పోవడం మానుకున్నే.. మా ఆయన వస్తాండాడుక్కా... దగ్గు ఇన్పిస్తాండాది. వస్తా'' అంటూ పరుగున ఇంట్లోకి పోయింది సుశీల.

## 3

### తను వంటమనిషి

***

వంటలు బాగున్నాయని అనగానే అందరూ గుర్తు చేసేది నలభీములనే. వాస్తవానికి చాలా మంది స్త్రీలు వంటింటికే పరిమితం అవుతున్నారు. వంట చేయడం అనేది కేవలం స్త్రీల పనిలా మారింది. అదే 'వంటచేయడం' ఓ కుటుంబాన్ని నిలబెట్టింది.

***

''రాజన్న వస్తాండాడున్నో'' అరిచారు వీధి చివరనుంచి ఎవరో.

ఆ పేరు వినగానే సుశీల, నాగాచారి ఇంటికి తాళం వేసేసి పరుగున వెళ్లి పక్కింటిలో దాక్కున్నారు.

రాజన్న స్కూటర్‌లో వచ్చి నాగాచారి ఇంటి ముందు ఆగాడు. ఇంటికి తాళం వేసి ఉండటం చూసి పక్కింటి గోవిందమ్మతో ''వీళ్లు యాడికి పోయినారమ్మా'' అనడిగాడు.

''ఈ రోజు పొద్దన్నే, సుశీల వాళ్లమ్మోల ఊరికి పోయిందన్నా.. నాగాచారన్న యాడికి పోయినాడో తెలీదు'' అందామె.

''ఈ నాకొడుక్కు బంగారిచ్చి ఈళ్ల ఇంటి సుట్టకారం తిరుక్కునే పనయిపోయిందే. ఏ పొద్దొచ్చినా ఇంట్లో ఉండడు. ఆడేమో అంగడి మూసేసినాడు. ఇంగా చానామంది దగ్గర సొత్తు తీసుకోని వస్తువులు చేసీలేదంట. ఈడూ, ఈని తాగుడు, ఈని పెగ్గి మాటలు.. ఇబ్బుడేమయినాయో!? మ్మోవ్.. ఇగ ఇదే కడ! ఇబ్బుటికి పది

# పెద్దల మాటలకి పెడర్థాలు తియ్యకండి!

'విస్సన్న చెప్పింది వేదం' అన్న తెలుగు నానుడి ఇంద్రగంటి విశ్వపతి శాస్త్రిగారివల్ల వచ్చింది. ఆ రోజుల్లో శ్రుతి స్మృతి పురాణ ఆగమ శతాదుల్లో ఎవరికి ఏ అనుమానం వచ్చినా, ఆయన దగ్గరకి వెళ్ళి అనుమాన నివృత్తి చేసుకుని, ఆయన చెప్పింది వేదవాక్కుగా స్వీకరించేవారు. ఒక్క ఆంధ్రులే కాదు. యావత్ దాక్షిణాత్యులకూ ఆయన గురుస్థానీయుడు. విశ్వపతి శాస్త్రిగారు చెప్పారంటే ఇంక తిరుగులేదు. అది సాధికారం. అందుకే 'విస్సన్న చెప్పింది వేదం' అంటూ వచ్చారు.

ఒకమారు, పిఠాపురం జమీందారులూ సూర్యరాయాంధ్ర నిఘంటుకర్తలూ అయిన, రావు వేంకట సూర్యారావు బహద్దరుగారి తండ్రిగారు బ్రాహ్మణ పురోహితులపట్ల కాస్త చులకనగా మాట్లాడారట. ఆయన అన్నది ఏం లేదు 'ఆ సంభావన బ్రాహ్మణుల్ని కాస్త ఆగమనండి'అని. ఆ అనడంలో 'సంభావన' అనే మాటని, ముష్టి అనే అర్థంలో ఎగతాళిగా మరి కొంచెం వత్తి పలికారు. అంతే.

ఆ వార్త కాస్తా యానాం పరిసరాల్లో ఉన్న విశ్వపతి శాస్త్రిగారికి ఎవరో చేరవేశారు. జమీందారు గారు సంభావనని సత్కారంగా పరిగణించకుండా ముష్టిగా చూడ్డం, కష్టం వేసింది శాస్త్రిగారికి. ఓమారు జమీందారుగారు శాస్త్రిగారిని కలవడం తటస్థించింది. అప్పుడు సంభావన ప్రస్తావన వచ్చింది. ''ఆ సమయంలో సమ్ (Sum) మూడ్‌లో వుండి అన్నాను. పోనీయండి'' అన్నారు జమీందారుగారు. ''నేనూ అదే చెప్పబోతున్నాను. మన పూర్వులు దాన్ని సమ్ (Some) భావనతో ఏర్పాటు చేశారు. మీరు దాన్ని ఎగతాళి చెయ్యకండి'' అన్నారు



శాస్త్రిగారు. జమీందారుగారు మొదట విస్తుబోయి తర్వాత నవ్వారు. విశ్వపతి శాస్త్రిగారు కూడా నవ్వేసి ఆ ప్రస్తావన అంతటితో ఆపేశారు.

★

సార్లన్నా వచ్చింటా.. వచ్చే ఆదివారం వస్తాను. ఆ పొద్దుటికి నా బ్రాస్‌లెట్, మైనర్ చైనూ ఇచ్చేయాలని చెప్పు. లేకపోతే నా దుడ్డు నాకు పారేయమని చెప్పు. లేదంటే నేను చానా చెడ్డనాకొడుకును. మంచిగా అడగతాంటే ఈడు ఇనేటిగా లేడు. తీసకపోయి బొక్కలో ఏపిస్తా''అని గట్టిగా అరిచాడు రాజన్న.

''ఇచ్చేస్తార్లేన్నా.. ఏవో ఇబ్బందుల్లో ఉండారు'' సర్దిచెప్పింది గోవిందమ్మ.

''ఇబ్బందులందరికీ ఉంటాయివమా.. మాగ్గూడా ఉండాయి. అట్లని మేం ఇవ్వాల్సినోళ్లకు ఎగ్గొట్టేస్తా ఉండావమా? దాంకొంటా ఉండామా? నేనొచ్చి పోయినానని చెప్పు'' అని స్కూటర్‌లో వెళ్లిపోయాడు రాజన్న.

ఆమె వీధి చివరిదాకా వచ్చి చూసి, రాజన్న కనుమరుగయ్యాక ఇంటికొచ్చి, అతనెళ్లిపోయాడని చెప్పింది. అప్పుడు బయటకు వచ్చారు సుశీల, నాగాచారి.

ఇద్దరి గుండెలు భయంతో వేగంగా కొట్టుకుంటున్నాయి.


''ఏందిన్నా ఇది.. నువ్వేమో ఆయన బంగారంతా అమ్ముకుని తినేసినావు.. ఆయనేమో ఇంటిమిందికొచ్చి అరస్తాండాడు. ఇట్ల ఎన్ని దినాలు'' అంది గోవిందమ్మ.

నాగాచారి మౌనంగా ఉండిపోయాడు. తప్పు చేసినవాడిలా తల దించుకున్నాడు.

''ఇద్దురు బిడ్డలకు పెండ్లిండ్లు చేసినాం కదాక్కా.. నేను చెప్తానే ఉండా, ఊరోళ్ల బంగారొద్దని. ఈయన ఇంటే కదా.. బంగారిచ్చినోళ్ళు ఊరికే ఉంటారా?'' అంది సుశీల.

''మొగున్ని ఎనకేసుకోని రావద్దమ్మా.. సగం బంగారు తిండికి, తాగుడుకే ఖర్చు పెట్టేసింటాడు. ఎంతటోనికయినా టయాలు ఒగోసారి బాగుండవు. అప్పులయితాయి. వోటిని తీర్చుకోవాల కదా.. ఇట్ల దాంకోని ఎన్ని రోజులుంటారు?'' అంది గోవిందమ్మ.

నాగాచారి, సుశీల మౌనంగా ఉండిపోయారు.



''సుశీల అన్నం కూరలు చానాబాగ చేస్తాది. మీరు ఇంట్లో ఇద్దురే గదా ఉండారు. హైదరాబాదులో మాకు తెలిసినోళ్లుండారు. వోళ్లకు వంటమనిషి కావాల. నెలకు పద్దైదు నూర్లిస్తారు. తిండంతా గడచిపోతాది. రెండేండ్లుంటే మీ అప్పులన్నీ తీరిపోతాయి. నేను ఎన్నిసార్లు చెప్పినా నువ్వు ఇనిపించుకోవడం లేదున్నా'' అందామె.

అక్కడినుంచి నాగాచారి విసురుగా వెళ్లిపోయాడు. ఆ పోవడంలో భార్య హైదరాబాదుకు పోవడం ఇష్టం లేదనే సంగతి స్పష్టంగానే తెలుస్తా ఉంది.

''వోళ్లతో మాట్లాడక్కా.. నేను పోతాను'' అంది సుశీల. ఆమె మొదటిసారిగా భర్తను అడగకుండా, ఆయన సమ్మతి కోసం చూడకుండా నిర్ణయం తీసుకుంది. తమ పెళ్లయిన పాతికేళ్లలో మొదటిసారిగా ధైర్యంగా ఓ నిర్ణయం తీసుకుంది సుశీల. మరో వారం రోజుల్లోనే సుశీల హైదరాబాద్‌కు వెళ్లిపోయింది.

సుశీల వంటను ఆ ఇంట్లో వాళ్లు బాగా మెచ్చుకున్నారు. తనకు చిన్నప్పుడు అమ్మ వంట పనులు నేర్పిస్తుంటే, పెళ్లయ్యాక భర్త తనను వంట ఇంటికే పరిమితం చేస్తుంటే సుశీల ఆ ఇద్దర్నీ బాగా తిట్టుకునేది. అమ్మతో అయినా ఎప్పుడన్నా ఎదురు తిరిగి మాట్లాడింది గానీ, భర్తకు ఏనాడూ ఎదురు చెప్పలేదు. అతను కోరిన రీతిలో వంటలు చేసి పెట్టింది. పోనీలే, అప్పుడు నేర్చుకోవడం ఇప్పుడు తమ కుటుంబం పరువు కాపాడ్డానికి ఉపయోగపడుతోంది అనుకుంది సుశీల. విషాదంలో కూడా అదొక ఆనందం!

రెండేళ్లయ్యాయి. మధ్యలో సుశీల ఒకసారి తిరుపతికి వచ్చి పోయింది. నాగాచారి ఒకసారి హైదరాబాదుకు పోయి వచ్చాడు. సుశీల తిరుపతికి వెళ్లిపోతానంటే ఆ ఇంట్లో వాళ్లు అప్పుడే పోవద్దంటున్నారు. 'నీ లాగా వంట చేసే మనిషి దొరకదు. ఇంకొన్ని రోజులుండు. ఎవరినయినా చూసుకుంటాం' అన్నారు. అలా మరో ఏడాది గడిచిపోయింది.

అప్పులన్నీ తీరిపోవడంతో నాగాచారికి ఇప్పుడు ఒంటరితనం బాగా ఇబ్బంది అనిపిస్తా ఉంది. ఆర్నెళ్లనుంచి భార్యకు నెలకోసారి ఫోన్ చేసి వచ్చెయ్యమని చెబుతున్నాడు.

ఆ రోజు కూడా సుశీలకు నాగాచారి ఫోన్ చేశాడు.

''ఏమే.. వచ్చెయ్యి యింగ..'' అన్నాడు.

''ఆడికొస్తే ఏం పనుంటాదిబ్బా.. ఈడుంటే నెలకు రెండు వేలు వస్తాండాయి కదా..'' అంది సుశీల.

''ఇంగ నేను పని చేస్తాలే..''

''ఇంతకు ముందు కూడా చేసినావు కదా?'' అంది సుశీల. ఆ మాటల్లో దెప్పి పొడుపు కూడా ఉంది.

''అప్పటి కత ఏరులేమ్మే.. పనికొచ్చిన బంగారు బిడ్డల పెండ్లికి వాడేస్తిమి. అగ్గవ కొస్తాం డాదని దొంగబంగారు కొని మోసపోతిమి. అప్పు లయిపోతిమి. ఇప్పుడు కుదురుగా పని చేసుకుం టాలే. అప్పులన్నీ తిరిపోయిండాయి. వచ్చే సేయి''

''అడికొచ్చినా కూడా నేను ఖాళీగా ఉండలే నుబ్బా. ఎవరింట్లోనో ఒగరింట్లో పనికి కుదురు కుంటా. వెయ్యో పద్దైదు నూర్లో వచ్చిన కాడికి రానీలే.. అట్లయ్యేటిగా ఉంటేనే ఆడికి వస్తా'' భర్తకు షరతు విధించింది సుశీల.

మరో రెండు నెలలకు సుశీల తిరుపతికి వ చ్చేసింది.

నాగాచారి బజార్లో మళ్లీ ఒక చిన్నగది అద్దెకు తీసుకుని బంగారుపని చేయడం మొదలు పెట్టాడు. 'నువ్వు ఊరోళ్ల ఇండ్లల్లో పని చేసే అవ సరం లేదులే.. నేనే సంపాదిస్తాను' అన్నాడు. భర్తలో మార్పుకు సంతోషించింది సుశీల. అయితే అతనిలో మార్పు శాశ్వతం కాదని కొద్ది రోజులకే తెలిసిపోయింది. నాగాచారిలో పూర్వపు అలవాట్లు మళ్లీ మొదలయ్యాయి. అతని సంపాద నంతా తాగుడుకే చాలడం లేదు. ఇంటికి కూతుం డ్లొస్తే వాళ్లకు అరువుగా తిండి పెట్టలేని పరిస్థితి. దీంతో సుశీల భర్తను అరిచింది. 'నువ్వు పనేమీ చెయ్యద్దు. నేనే సంపాదిస్తాను' అంది. తమకు రెండు వీధుల అవతల ఒక ఇంట్లో వంట చేయ డానికి ఒప్పుకుంది. నెలకు వేయి రూపాయల జీతం.

ఏడాది గడచింది. సుశీలకు ఆరోగ్యం బాగలే కుండా పోవడంతో ఆసుపత్రిలో చేరింది. డాక్టర్లు ఆపరేషన్ చేసి గర్భసంచి తీసేసారు. దీంతో సుశీల బయట పనిచేయడం మానేసింది. అయనా నాగాచారిలో పెద్ద మార్పేమీ లేదు. బాధ్యతా లేదు.

## 4

తను వట్టిమనిషి

***

పుట్టుకతో మనిషికి ఎలాంటి కోరికలూ, ఆలోచ నలూ, నైపుణ్యాలూ ఉండవు. పెరిగే క్రమంలో అవసరాలు మనిషిని తనకు ఇష్టం ఉన్నా లేకున్నా రకరకాలుగా తయారు చేస్తాయి. అలాంటి అవసరాల సంకెళ్లను తెంచుకున్న ఓ మనిషి వట్టిమనిషిలా మిగిలిపోయింది.

***

ఎదురుగా నేలమీద నాగాచారి శవం. పైన పూలదండలున్నాయి. తల వద్ద అగరవత్తులు వెలిగించి, ప్రమిదలో దీపం పెట్టారు. బంధు వులు ఒక్కొక్కరే వస్తున్నారు. సుశీల గోడకు ఆను కుని కూర్చుని భర్త మృతదేహాన్నే చూస్తోంది. ఆమె కళ్లు ఏడ్చి ఏడ్చి ఇంకిపోయినట్టున్నాయి. ఆమెకు అటూ ఇటూ కూతుళ్లిద్దరూ కూర్చుని ఉన్నారు.

''నాగాచారి సచ్చిందకా తన పద్ధతి మానుకో లేదమ్మా..''

''ఆ..ఆ తాగుడు లేకుండా ఉన్నింటే ఇంగో ఇరవై ఏండ్లు బతికిండేవాడు. ఆడమనిషి సంపా దించి ఏస్తాండాది కదా.. తాక్కుండా ఇంటిప ట్టున ఉన్నింటేనేమి?''

''ఆయన తాక్కుండా ఉండేటిగా ఉంటే ఆడ మనిషి పనిచేసే అవసరం ఏముండాది''

''సుశీల కాబట్టి చేసిందమ్మా.. ఇంకో ఆడద యింటే చేసిండునా?''

''కట్టుకునిందానికి భార్యను ఏ పొద్దన్నా సుఖపెట్టినాడా.. ఆయన సుఖపడినాడంతే.. మొగోని మాదిర్తో సుశీలే కష్టపడింది. కుటుం బాన్ని నిలబెట్టింది''

''పోతే పోనీలేమ్మా.. ఆయన ఉన్నే లేనట్టే.. ఉన్నే ఈయమ్మకు ఇంగా పనెక్కువ.. ఇంగ ఎవ్వ రికీ ఏ సేవలూ చేసే అవసరం లేదు. తింటుందో తినదో.., హాయిగా ఉండచ్చు. అడిగేవాళ్లెవరూ ఉండరు''

చావుకు వచ్చిన వాళ్ళు రకరకాలుగా మాట్లా డుకుంటున్నారు.

వాళ్ల మాటలు సుశీల వింటోందో లేదో, ఆమె ముఖంలో సంతోషమూ, దుఃఖమూ కలగలసిన విచిత్రమైన భావం కదలాడుతోంది.

బంధువులందరూ వచ్చారు. సాయంత్రానికి నాగాచారి మృతదేహానికి అంత్యక్రియలు అయి పోయాయి. బంధువులు ఎవరి ఊర్లకు వారు వెళ్లి పోయారు. పదకొండో రోజు కర్మక్రియలు అయ్యాయి.

ఇంట్లో సుశీల ఒంటరిగా మిగిలింది. మను షులతో మాట్లాడ్డం తగ్గించింది. రెండు వేల రూపాయలిస్తామన్నా వంట పనికి ఒప్పుకోలేదు. నాలుగిండ్లల్లో పాచిపనికి కుదురుకునింది. నెలకు వేయి రూపాయలు వస్తాయి. వాళ్లు ఇచ్చే మిగిలిన కూరలు, అన్నాలు తెచ్చుకుంటోంది. వాటినే తిని నీళ్లు తాగి ఉటోంది. ఇంట్లో పొయ్యి ముట్టించడం మానేసింది.

రోజులు గడుస్తున్నాయి. ఓ రోజు పెద్దకూ తురు అల్లుడు వచ్చారు. సుశీల అన్నం చేసింది. పప్పు చేసి రసం పెట్టింది. వాటిల్లో రుచే లేదు! తినేదానికి వీల్లేకుండా ఉన్నాయి.

''ఏందమ్మా.. కూరలు ఇట్లుండాయి?'' అడి గింది కూతురు.

''చిన్నప్పట్నించీ కూరలు చేసీ చేసీ విసిగిపో యిండా. అమ్మను కాదనలేక వంట నేర్చుకున్నే. మీ నాయన్ను ఎదిరించలేక వంటచేసినా. కుటుంబం పరువుకోసరం వంటమనిషిగా మారినా. నా కోసరమయితే వంట చేసుకునే పనే లేదు. కానీ వంట చేయక తప్పలేదు. నాకు వంట చేయడం అంటే విసుగు. కోపం.. మీ నాయన సచ్చిపోయాలకు నాకు ఒకపక్క బాదగా ఉన్నే ఇంగో పక్క చానా సంతోషమేసింది. ఇంగ అరు వుగా వంట చేసే పనిలేదు కదా అన్పించింది. నిజంగా కూడా ఇప్పుడు నాకు కూరలు ఎట్ల చేయాలో తెలీడం లేదు.. రసం పెట్టుకున్నే బాగుండటం లేదు.. ఏ కూరకు ఏమెయ్యాల్నో, ఎంతెయ్యాల్నో గుర్తే లేదు. ఏమేం కూరలు చేస్తారో కూడా గుర్తు లేదు. వంట సంగతులన్నీ నా బుర్రలో లేకుండా పోయినాయి. అయ్యి లేక పోతేనే ఆనందంగా ఉండాను. మీరొచ్చినారని కష్టపడి ఇయ్యి చేసినా. నాకేపనీ రాకపోయినా బాధలేదు. నన్నెవరూ మెచ్చుకోవాల్సిన పని లేదు. నాకిట్లే సంతోషంగా ఉండాది!'' అంటున్న సుశీలను కూతురు, అల్లుడు ఆశ్చర్యంగా చూస్తు న్నారు.

★


సుంకోజి దేవేంద్రాచారి

9949118082